౧

# పొట్టిరవికలూ – వాలుజడలూ

ఆ చేడెల కిద్దఱికీ ఎంత నేస్తంఅంటే కుళాయినీళ్లకెళ్లేటప్పుడు కూడా ఉత్తబిందె ఇద్దఱూ తోడెట్టుకెళతారు. తోడికోడళ్లా అంటే తోడికోడళ్లు కారు. ఒక యింటి ఆడపడుచులా అంటే వాళ్లూ కారు, వదినే మరదండ్రా అంటే ఉహూ. కట్టీ యీడూ యిద్దరిదీ కూడా. ఇద్దరిచాయా కూడా సాయంకాలం నీరెండలో నీలాంబరపుష్పాన్ని అనుకరిస్తూ వుంటుంది. రోడ్డు మీద ఇద్దరి నీడలూ ఒకటేపొడుగు; ఇద్దరి జడలూ వాలుజడలే. నల్లని ఒత్తుకురులు పెనేసి చివర రిబ్బను ముక్కలు ముడెట్టి సాగలాగినవే. వెనక్కు వెన్నుపూసనే పడేస్తే పిఱుదులకందం. ముందుకు బుజమ్మీద నుంచి తీసుకుంటే ఉరోజాలకందం. జడలంటే అలావుండాలి. ఏమి చెణ్ణేకుండా కప్పవలసిన చోట కప్పుతూ, కుప్పసం కొంచెం కుస్తవగుడ్డ తక్కువదైనా కాపాడాలి, కచమన్నాక కుచాన్ని.

ఏమో అంటే ఈ రోజుల్లో రవికలు బొత్తిగా చిన్నవి పలచనివి కుట్టించేస్తున్నారు స్త్రీలు. వాటిని రవికలనడానికి వీల్లేదు. —ఇక్కడ కొంచెం కథకు సందర్భించని రెండుముక్కలు జ్ఞాప

కం, వస్తూన్నాయి; భారతగాథలో ఇతిహాసాల్లాగు—రామాయణంలో పిడుకల వేత కాదులేండి. ఇంపుగానే వుంటాయి, స్త్రీలు కులాసాగా అంతావిని చివరచిరాకు పడ్డాగానీ—

ఒకావిడ రైక సరిగా తొడుక్కోకుండానో సగం సగం కనబడేలాగు తొడుక్కోనో, మగని దగ్గఱకెళ్లి "ఆర్యపుత్రా! రవికానసనిచో కవిగాంచునేగదా" అంటారే కవిచూచేది ఏమిటండీ?" అని అడిగిందట. అంటే భర్త "సిబోర" అన్నాట్ట చళ్లున చపేట ఇచ్చినట్టు. ఆమెపాపం—రవి అంటే సూర్యుడు, సూర్యుడు కాననిచో అని ముచ్చటగా ముద్దుగా ఊహించుకడిగింది. అతగాడు ఆపెడర్థాల పెనిమిటి, రవిక = రైక, ఆసనిచో=సరిగా ఆసకపోతే అనగా అమరక పోతే, అంటి ఉండకపోతే, అని ఆయిల్లాలి రూపు సందర్భాన్ని బట్టి అలా అధ్యాస్నం మధ్యాహ్నంగా అన్వయించేడు కాబోలు—దగ్గరే కవి ఉంటే ఎంత సిగ్గుపడిపోయేదో ఆపణతి- దానికేం, భార్యాభర్తల మధ్యసవాలు అది. మరోగాథ విన్నది చెప్తాను. ఒకాయన బావవరస వాడు ఓపడుచు మఱదల్తో కబుర్లు చెబుతూ వంటింట్లో కూర్చున్నాట్ట. ఆ మఱదలు సూరాగుమ్మడికాయ దభీమని కూరకో పులుసుకో నేలనేసి కొట్టి ఓముక్క కత్తిపీటను పరపరా తరుగుతూందిట. ఆమె అసలే రవిక తొడుక్కోని పడుచుపిల్ల, మడికి పలాచటి బిన్నీకంపెనీ తెల్లచీరకట్టుకోని ఇలా తరుగుతూంది — అరచాటగు అంధ్రవధూటి జ్ఞాపకం వచ్చేటట్టు.

ఈ బావ తోచకో మంచి ముక్కలాంటి ఉబ్బివున్న గుమ్మడి గింజ జారుజారుది తన కుడిచేతి బొట్టన వ్రేలికి తర్జనికి మధ్య పెట్టుకొని యాదాలాపంగా నొక్కేట్ట—చట్టున వెళ్లి తిన్నగా అది ఆ మరదలి దక్షిణ చూచు క్రాగమ్మీద తగిలించట—ఎడంభాగం గుండె అదిరేటట్టు. పైకేమంటుంది? ఓర్చుకుని ఊరుకుంటదట. ఇవన్నీ స్త్రీయొక్క మానం కాపాడ్డం అనే రస వత్తర ఘట్టాని కుపాఖ్యానాలు—చూడండి! అపరిస్థితుల్లో కనక జడలేఅడ్డుంటే స్త్రీకి సిగ్గుపడవలసిన అవసరంలేదు. అపాయం తటస్థించదు. అందుకే కొందరు బుద్ధిమంతు రాండ్రైన పెద్ద ముత్తైదువులు ఇప్పుడిప్పుడు జ్ఞానం తెచ్చుకుని సిగలూ కొప్పులూ మానేసి వాలుజడలే వేసుకుంటున్నారు.

ఇక అసలు కథకు వద్దాం. జడలన్నవి ఆలావుండాలి. అందు కోసం కావాలి—ఇంతకూ చదువకుల్ని ఓసందేహంలో వదిలే శాను. ఆ చేడె లిద్దరూ ఇంతకూ రవికలు తొడుక్కున్న వాళ్లా, తొడుక్కున్నా చాలీచాలని రవికలు తొడుక్కున్న వాళ్లా, లేకపోతే యేమిటి అని ఇంతవరకు వివక్షత చెప్పకుండా వుండ డమనేది నాదే క్రౌర్యము. వాళ్లకిద్దఱకూ రవికలున్నాయి. తెల్లని గ్లాస్గోమల్లువి మెడదగ్గర ఊటకలం తగిలింపు కనుకూల మైన చంద్రవంక కత్తిరింపువీ, బుజాలు పైని దిగలాగితే దిగు చాయను గాలి దేవుడు కితకితలెట్టేవీ—రవికలు తొడుక్కున్నా లేనట్టే అని భావించుకోండి. ఇక చీరకట్టు తదనుగుణ్యాం. గాలి

వాళ్ళకు ఎదురుగా పిస్తోంది. అప్పుడే అందం అంతా! ఆడో గాడిదిని కడపే సహ్యంఛాలవంటి తొడల మధ్య నా స్త్రీలయొక్క చీర కుచ్చెళ్ళు గాదిగాదిగ పోతూంటే ఆవ్యంగ్యాని కంతే లేక పోయింది మగవాళ్లు నుకొన్నారంటే అనుకోరు మరి?

అందులో ఒకడికి పెద్ద బుగ్గ మీసాలు. ఒకడికి ఫ్రెంచి కట్. — ఫ్రెంచికట్ వాడన్నాడు "ప్రేమసువాస నేను కుంటూ వస్తూవుంది. కాసుకో" అన్నాడు. బుగ్గమీసాల వాడు తనచేతితో మీసాలు సవరించుకొని ముక్కు సరిచేసు కొనేలోపున స్త్రీలిద్దరూ వాళ్ళను దాటిపోయినారు. "ఎక్కడ!" అన్నాడు బుగ్గమీసాలవాడు. అందుకే అంతంత మీసాలు తీసేసి నాలాగు ముక్కుకింద మాత్రమే కాస్త పలచ పలచగా ఉంచుకోమంటాను. — చెయిపెట్టి మీసాలు ఒత్తుగించుకొని ముక్కుపోణాలు పెద్దవి చేసుకొనేదాకా ప్రేమవాసన నీకోసం ఆగివుంటుంది? ఇప్పుడే అలా వెళ్ళింది. గుప్పుమ్మపోయింది నాముక్కు." అన్నాడు ఫ్రెంచికట్‌గాడు. "అంతగా వాసనే ప్రాముఖ్య మైంది అని తోస్తే ఆ రెండు వెంట్రుకలూ మాత్రం ఎందుకు?" అన్నాడు బుగ్గమీసాలవాడు. "ఈ రోజుల్లో ప్రేమదాని యొక్క ఆఘ్రాణపు ఘాటునుబట్టి గ్రహించుకోవడం కాకపోతే పాణిగ్రహణేన అనుకొన్నావా యేమిటి? కాదు. ఇక ముక్కు కింద ఈ రెండు వెంట్రుకలయొక్క ప్రయోజనం చెప్ప మన్నావా? అవి మగవాడికు గుర్తు. లేకపోతే ఆడమొగానికి

పేసి మొగానికీ తేడాయే తెలీదు. — ఏమైతేనేం హీటుంటూ వుంటే ఫ్రెంచికట్ ఉండాలి మీసాలకు.'' అని తన నెత్తిమీద హేటుతీసి చంకలో పెట్టుకొని ''నీకేం పరిమళించలేదూ? బొత్తిగా పరిమళించలేదూ ప్రేమ? — ఆ వెళ్ళేపిల్లలిద్దరూ మిషన్ బోర్డింగులోని పిల్లలు. ఓదాని పేరు మిస్ పుస్సిపుట్టు, రెండవదాని పేరు మిస్ థారంటల్. నీక్కావలీ అంటే మిస్ థారంటల్ ని ప్రేమించుకోవచ్చు. మిస్ పుస్సీపుట్టు నాది —'' అన్నాడు ఫ్రెంచికట్ మీసగాడు. బుగ్గమీసాలమనిషి అన్నాడు, '' నేను అచ్చువైదీకపుముండావాణ్ణి — మీసాలు పెంచుకొనేసరికే మాతాత ముత్తాతలు పైని తహతహ లాడి పోతున్నారు. ఇక మిస్ థారంటన్నుని ప్రేమిస్తే తారుతారయి పోరూ! అది వర్ణాంతర వివాహంకూడా కాకుండా — మతాంతర వివాహంకూడా అయిపోయి అటు బంగాళా ఖాతాన్ని ఇటు అరేబియా సముద్రాన్ని ఉప్పొనెత్తించి దక్కను పీఠభూముల్ని హిమాలయా శిఖరాల్నికూడా ముంచేస్తుంది. భారతవర్షం పిపీలికాది సమేతంగా సఫా —'' అన్నాడు. ఫ్రెంచికట్ గాడన్నాడు '' ఈ వేళకు ఈ చూపూ ఈ వెలుగూ చాలుమనకు. గుడ్ నైట్!'' అన్నాడు. ఎవరికి వాళ్ళు వెళ్ళి పోయినారు.

నిజంగా ఆ స్త్రీలెవ్వరో ఆ మగవాళ్ళకు తెలియదు. ఆ మగవాళ్ళెవరో ఆ స్త్రీలకు తెలియదు. బాధ్యతలేని మగాళ్ళు

ఆడాళ్ళనుగురించీ, బాధ్యతలేని ఆడాళ్ళు మగాళ్ళను గురించీ, ఏదో అనుకుంటూ ఉత్తర క్షణమందే మరోపనిమీద ఏమతీ పోయే వెఱ్ఱి చిద్విలాసపు నాటక ప్రదర్శనం అనుకోండి ఆ సాయంకాలం ఆ పురుషుల సంభాషణా ఆ పశుచుల సందర్శనమూను.

కాలనేమికింద అయిదారేళ్ళు నునుపెక్కి పప్పుపప్పు అయిపోయినాయి. ఈ పైని వ్రాసేది అప్పటిమాట. మిస్ థారంటన్ ఒక డిప్యూటీ ఇన్స్పెక్ట్రెస్ ఆఫ్ గర్ల్సుస్కూల్సు అయింది. బుగ్గమీసాలమనిషి ఎక్కడా ఉద్యోగం దొరక్క ఒక ఆడపిల్లలబళ్లో తెలుగుచెప్పే బడిపంతు లయినాడు. మిస్ థారంటన్ ఆ గర్ల్సుస్కూలు పరీక్ష చేయడానికి వెళ్ళింది. గడగడలాడుతూ బుగ్గమీసాలాయన నిలబడి అమ్మగార్కి సలాం పెట్టినాడు.

మిస్ థారంటన్ అంది "ఏమండీ! మాస్టర్! మీముఖం ఎక్కడో ఇదివరకు చూచినట్టుగా ఉన్నదండీ" అని. "ఏమిటో వైదీకి మీసాలు తల్లీ!" అన్నాడు వెఱ్ఱిబాగులాయనలాగు నవ్వాడు. మిస్సమ్మగారన్నారు. 'వేదిక్ ముస్టాష్'! అని. తెలుగు పండితుడు "ఇంకేం వేదితల్లీ! కాగి చల్లారిన పాలలాగు అయిపోయాను. నలుగురు పిల్లలూ భార్యా ముసలితల్లీ — ప్రమోషన్కి రికమెండు చెయ్యాలి" అన్నాడు. "మిస్ పుస్సీఫుట్టు ఇన్స్పెక్ట్రెస్ ఆఫ్ ఫస్టు సర్కిల్. ఆవిణ్ణి చూడండి."

అంది మిస్ థారంటన్. “కాని ఆవిడ ప్రియుడిది ఫ్రెంచికట్. ఆలోచించుకోండి.” అని అందికూడాను, వినిపించీ వినబడనట్టు. అంతకంటె వినిపించీ వినబడనట్టు పండితరాయలన్నాడు “అయితేం అమ్మగారూ ఆవిడదీ పొట్టి రయికే వాలుజడే అనుకుంటాను ఇప్పటికీ! స్వతంత్రించి ఆర్డరు వెయ్యకపోరు. వెళ్ళి తప్పకుండా దర్శనం చేసుకుంటాను.” అని. తెనుగు మాష్టరు మహా చెడ్డముండాకొడుకు!!!



| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| --- | --- | --- |
| 20-7-1984 | రాజమండ్రి | “వినోదిని”లో |